54.

# భగవంతుని ప్రేమను ప్రచారము చేయువారే నిజమైన దైవదూతలు

**అల్లాయంచు మహమ్మదీయులు జహోవాయంచు సత్క్రైస్తవుల్**
**పుల్లాబ్జాక్షు డటంచు వైష్ణవుల్ శంభుండంచు శైవుల్ సదా**
**ఉల్లాసంబున గొల్వనెల్లరకును నాయుర్భోగ భాగ్యాది**
**సంపల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ.**

ప్రేమస్వరూపులారా!

మానవజీవితము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది అనే తత్వము ప్రతి ఒక్కనికి తెలిసినదే. మెసెంజర్స్ ఆఫ్ సత్యసాయి అని పేరు పెట్టుకొని అనేక విధములైన సేవా కార్యక్రమములలో పాల్గొని, సమాజ సంక్షేమము నాశించి సత్కర్మలు సలుపుతున్నారు అనంతపూర్ కాలేజీ గరల్స్. ప్రప్రథమంలో మెసెంజర్సు అంటే ఏమిటి, ఎవరు మెసెంజర్సు అనే సత్యమును గుర్తించటం అత్యవసరము. ఈ విశాల ప్రపంచములో జన్మించిన ప్రతిమానవుడు భగవత్ప్రేరణ చేత ఈ జగత్తులో ఆవిర్భవించినటువంటి వాడే. ప్రతి మానవుడు భగవంతుని యొక్క దూతనే. భగవంతుడు ఈ మెసెంజరును ఈ జగత్తుకు పంపినవాడనే సత్యాన్ని విచారణ చేసినప్పుడు పరమ సత్యము ప్రపంచమునకు బోధపడుతుంది.

**పరమాత్మ ప్రేమను ధరణిలో జనులకు**
**అందింపజేయుటే ప్రథమ కర్మ**
**ప్రతి మానవుండును బ్రతికి తానుండుట**
**స్వార్థంబునకు కాదు సంఘసేవ**
**చేయుటకే అన్న శ్రేష్ఠ భావంబుతో**

sri sathyasai vahamrutam

**మెలగుచుండిన మేలు కలుగు**
**మరచియు తను తాను మానవసేవకే**
**అంకింత మొసగుటే ఆత్మ తృప్తి**
**ఇట్టి సంస్కృతి జగత్తున చాట**
**పంపినాడయ్య నిన్ను ఈ ప్రకృతి యందు**
**పుట్టి ఫలమేమి జగతిలో మనిషిగాను**
**కడపటికి మట్టిలో జేరు నీ మానవుండు**

ఓ మానవుడా! మానవుడుగా పుట్టి, మానవునిగా పెరిగి, మానవునిగా జీవించి మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకోటమే నీ కర్తవ్యమని ప్రబోధించాడు. పరమాత్మ మెసెంజరైన ప్రతి మానవుడు కూడను పరమాత్మ సత్యబోధనలు, ప్రేమ తత్త్వమును, శాంతి పదములను జగత్తునకు చాటి, అనుభవించి ఆనందింప చేయుటవే మానవుని ప్రధాన కర్తవ్యము. భగవత్తత్త్వాన్ని ప్రచారము చేసిన మానవునికే మెసెంజరని పేరు. అట్లు కాకుండా భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన, అనిత్యమైన విషయములు ప్రచారము చేసేవారు మెసెంజరు కానేరరు. సత్యతత్త్వమును, దివ్యత్వమును, ప్రేమతత్త్వమును, సహన తత్వమును, సానుభూతి తత్వమును ఈ జగత్తునకు చాటటమే మెసెంజరుగా నున్న వాని కర్తవ్యము. అయితే ఈ సత్యమును పురస్కరించుకొనే జీసస్ పుట్టినప్పుడు అరేబియన్ రాజులు ముగ్గురు చేరారు అక్కడ. ఆ చంటిబిడ్డను చూచి ఆనందించి, తిరిగి వెనుకకు వచ్చే సమయములో ఒకరాజు మేరీతో చెప్పాడు 'అమ్మా! నీ గర్భమునందు, భగవంతుని ప్రేమించేవాడు పుట్టాడు'. అతను చెప్పి తిరిగి వెళ్లే సమయంలో రెండవరాజు చెప్పాడు 'అమ్మా! మేరీ నీ గర్భములో పుట్టిన కుమారుని భగవంతుడు ప్రేమిస్తాడు. భగవంతుని చేత ప్రేమింపబడే కుమారుడు నీకు జన్మించినాడు' మూడవరాజు చెప్పాడు 'అమ్మా మేరీ భగవంతుడు వేరు, నీ కుమారుడు వేరుకాదు ఇరువురు ఒక్కటే' అనే సందేశము నిచ్చి వెళ్లాడు. ఈ మూడింటి అంతరార్థమును గుర్తించి వర్తించినప్పుడు సత్యము మనకు సుస్పష్టముగా గోచరమవుతుంది. భగవంతుని ప్రేమించే మానవుడు మెసెంజరు. భగవంతుని చేత ప్రేమింపబడేవాడు Son of God. రెండింటి ఏకత్వమును గుర్తించిన

sri sathyasai vachanamrutam

మానవుడు తండ్రి కుమారుడు ఒక్కడే అయినవాడు. దీనినే messenger of God, son of God, father and son are one అని మూడు భాగములుగా విభజించి పెట్టారు. ఈనాటి మెసెంజర్సు దేనిని జగత్తుకు అందిస్తున్నారు. ఏ కొంత మంది మాత్రమే భగవంతుని సందేశమును జగత్తుకు చాటుతున్నారు. అధిక భాగము లౌకికమైన, భౌతికమైన, అనిత్యమైన, అశాశ్వతమైన, లోకసంబంధమైన విషయములు ప్రపంచమునకు చాటుతున్నారు. భగవంతుని చేత ప్రేమింపబడేవాడైతే ఈవిధమైన దుర్మార్గమైన మార్గములలో ప్రవేశించడు. భగవంతుని ప్రేమ అందుకున్న మానవుడు భగవత్ప్రేమ తత్వాన్ని మాత్రమే జగత్తుకు చాటాలి. దీనినే జీసస్ కడకు తన ప్రాణము వదిలే సమయంలో all are one My dear son – be alike to every one అన్నాడు. దేహసంబంధమైన భావములు ఉంచుకొని దేహాభిమానముతో జీవించుటకు పూనుకోవద్దు. ఈ దేహము కూలిపోవునదే. దేహము అనిత్యమైనదే, అశాశ్వతమైనదే. దీనినే ఈ ప్రపంచములో death అన్నారు. దేహము నిరంతరము మారునటువంటిది. ఇలాంటి మారిపోయే దేహము సత్యమని ఎట్లా భావిస్తావు? భగవంతుడు సత్యస్వరూపుడు. సత్యమనగా త్రికాలములందు మార్పు చెందనిది. అట్టి సత్యస్వరూపుడైన మానవుని యొక్క ప్రేమ తత్వాన్ని సత్యమైన మార్గమందే ప్రచారం చేయాలిగానీ అసత్యము అనిత్యమైన మార్గమందు ప్రవేశపెట్టరాదు. అప్పుడే భగవంతుడు నిన్ను ప్రేమించగలడు. భగవంతుని చేత ప్రేమింపబడేవాడు కనుకనే జీసస్ నిరంతరము పవిత్రమైన దైవసందేశాన్ని ఈ జగత్తుకు చాటుతూ వచ్చాడు. Death is the dress of life. జీవితానికి death ఒక dress వంటిది. దేహము ఒక నీటి బుడగవంటిది. దేహము జీవికి ఒక తాగుడు వంటిది. కనుక ఈ దేహాభిమానమును విసర్జించి ఆత్మాభిమానమును వరించి, ఆశించమని ప్రబోధించాడు. దీనినే భారతీయ సంస్కృతి యందు 'దేహో దేవాలయ ప్రోక్తో జీవోదేవ స్సనాతనః' అన్నారు. సనాతనమైన భగవంతుడు నూతనమైన దేహమును ధరించి జగత్తునకు దైవ సందేశము నందించే నిమిత్తమై దేహాన్ని పోషిస్తున్నాడు. తదుపరి దైవము తాను ఒక్కడే అనే దానికి అంతరార్థము ఏమిటి? దైవము యొక్క సంపద, దైవము యొక్క అమూల్య సందేశము ఏమిటని విచారించినప్పుడు సత్యము, ధర్మము, శాంతి ప్రేమ, సహనము, సానుభూతి అట్టి దైవసంపద ఒక్క

srisathyasaivachanamrutam

కుమారునికి మాత్రమే చెందుతుంది. కానీ అన్యులకు చెందదు. కనుక ఇట్టి దైవసందేశమైన సత్యధర్మములను మనము చాటటానికి ప్రయత్నించాలి. అన్నింటికంటె ప్రధానమైనది ప్రేమ. అన్నింటియందు ప్రేమయే సహజమైన మార్గము. అన్ని గుణములందు ప్రేమ అంతర్వాహినిగా ఉంటున్నాది. కనుకనే ఆ ప్రేమయే దైవము Live in love. ఈ ప్రేమతత్వాన్నే మనం భగవంతునిగా తీసుకోవాలి. ఇట్టి ప్రేమ లేని హృదయము మానవత్వమే కాదు. కనుక ఈ మెసెంజర్సు అనగా ప్రతిమానవుడు మెసెంజరే. ఎందుకోసం జన్మించినామని విచారణ చేసినప్పుడు తిని, తిరిగి, తాగి నశించి, జీవితాన్ని వ్యర్థం చేసుకోటానికి కాదు. ఇది ఒక విధమైన మానవత్వానికే కొంత కళంకము కలిగించేది. మానవునిగా జన్మించి పశువుగా జీవించి కేవలం రాక్షసునిగా మరణించటం ఉత్తమమైన జీవితం కాదు. పుట్టినప్పటినుండి దైవసందేశాన్ని జగత్తుకు చాటాలి. ఏది చదివినా, ఏ ఉద్యోగములో ఉండినా, ఏ పనులు నీవు సాధించినా కట్టకడపటికి సందేశము దైవ సందేశముగానే మారాలి. ఈవిధమైన సత్యాన్ని ఎవరు పాటిస్తున్నారు? ఎవరు అనుసరిస్తున్నారు? ఎవరూ అనుసరించటం లేదు. దైవ సందేశము లోపల జీవితాన్ని అంకితం చేస్తున్నామంటున్నారు. అంకితమనగా ఏమిటి? నీవు చేసే సందేశము ఏమిటి? ఆ విషయమును ఎవరికి వారు యోచించుకున్నప్పుడు జీవితములో తొంభైతొమ్మిది భాగములు వ్యర్థము గావించుకుంటున్నారు. అది కాదు. వచ్చినప్పటినుండి ఉత్తమమైన, పవిత్రమైన, సత్యమైన ఆదర్శాలు, శాంతితో కూడిన ఆదర్శాలు జగత్తునకు చాటాలి. ఎవరికి వారు విద్యలు అభ్యసించటం, ఉద్యోగములలో ప్రవేశించటం, ధనము సంపాయించటము, భౌతికమైన దేహసుఖాలను అనుభవించటము వీటియందే కాలమును వ్యర్థము గావిస్తున్నారు. చదువు, ఉద్యోగముచేయి, ధనము సంపాయించు కానీ అన్నింటిని సన్మార్గములోపల, సత్కర్మల లోపల ప్రవేశపెట్టాలి. అనేకమంది అనేక అవస్థలకు గురయ్యే వారిని కంటితో చూస్తున్నావు. దీనులను, దిక్కులేని వారిని కంటితో చూస్తున్నావు. వీరందరికి ఏమి నీవు సహాయము చేస్తున్నావు? అందుకోసమే జీసస్ జెరూసలెంలో ఒక జంతువును బలి యిస్తుంటే సహించుకోలేక దానిని రక్షించే నిమిత్తమై అనేక పాట్లు పడ్డాడు. దానివల్లనే అందరు జీసస్‌ను బాధలు పెట్టటానికి మార్గం ఏర్పడిపోయింది. ఎక్కడ ఉపకార

sri sathyasai vahamrutam

బుద్ధి ఉంటుందో అక్కడ అపకారము ప్రవేశిస్తుంది. సుఖములను, దుఃఖములు వెంటాడుతూనే ఉంటాయి. సుఖదుఃఖములు లేని మానవుడు ఈ జగత్తులో కానరాడు.

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వీని విడదీయ ఎవ్వరి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ ఎందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు**

ఈ సత్యమును ఒక message గా తీసుకొని జగత్తుకు చాటమని బోధించాడు. కష్టములు లేకుండిన సుఖము యొక్క విలువ మనకు తెలియదు. చీకటి లేకుండిన లైటు విలువ మనకు అర్థము కాదు. కనుక సుఖము దుఃఖములను రెండింటిని మానవున కందించి, ఇందులో ఏది మానవునకు ప్రధానమో, ఆధారమో, ఏది అనిత్యము, ఏది అసత్యము అనే దీన్ని ప్రబోధిస్తూ వచ్చాడు. కనుక కష్టములను సహించాలి. కష్టమే సుఖాన్ని అందిస్తున్నది. కష్టమే లేని మానవునకు సుఖమంటే ఏమిటో తెలియదు. కనుక కష్టమును ఎదుర్కొని సుఖాన్ని సాధించాలి. జగత్తున కందించాలి. సుఖము లేనివానికి సుఖము చేకూర్చాలి. ఈ విధమైన ప్రతి చిన్న కార్యమునందు కూడను దైవ సందేశముగానే విశ్వసించి దైవ ఆదర్శముగా విశ్వసించి సందేశాన్ని జగత్తునకు చాటాలి. మానవుడు ఈ జగత్తులో ఎన్నియో రకములైన సుఖములనుభవిస్తున్నావు. ఈ అన్ని సుఖముల లోపల నీవు గుర్తించిన సుఖము ఏమిటి? నీవు సాధించిన సుఖము ఏమిటి, నీవు అనుభవించిన సుఖము ఏమిటి? ఇతరులకు అందించిన సుఖము ఏమిటి? విచారణ చేస్తే ఏమీ తేలదు. పుట్టినప్పటినుండి అనేక దుఃఖములతో బాధపడుతున్నారు. కానీ ఈ దుఃఖమునందే సుఖమున్నదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. ఏ సుఖము? దేహసుఖమా? లేక మానసిక సుఖమా? ఆత్మసుఖమా అని విచారించాలి. శాంతి అని ప్రబోధిస్తూ వచ్చారు. మూడు పర్యాయములు శాంతిః శాంతిః శాంతిః అంటున్నారు. దేహశాంతి, మనశ్శాంతి, ఆత్మశాంతి. ఈ మూడు శాంతులు మానవునకు అత్యవసరము. ఈ మూడు విధమైన శాంతులు దైవము యొక్క ప్రేమ చేత లభిస్తాయి. దైవప్రేమ లేని వానికి ఏ సుఖము ఉండదు. ఈనాడు అనేక సుఖములను ఆశిస్తున్నారు. కానీ ఇవన్నీ తాత్కాలికమైనవే. దీనినే శంకరాచార్యులవారు

sri sathyasai vachanamrutam

చెప్పారు. ఈ సుఖము అనేది నిజమైన సుఖము కాదు.

**మాకురు ధన జన యౌవన గర్వం**
**హరతి నిమేషాత్ కాలస్సర్వం**

ఏమిటి సుఖము. ఎయిర్ కండిషన్ రూమ్‌లో కూర్చోటం సుఖమా? అనేక పదార్థములతో భుజించటం సుఖమా! కాదు కాదు. ఇవన్నీ దేహానికి, మనస్సుకు సుఖమును చేకూరుస్తాయి గానీ ఆత్మశాంతి చేకూర్చవు. నిజమైన సుఖము ఆత్మ సుఖమే. ఈ ప్రాపంచిక సంబంధమైన కష్టములకు ఏమాత్రం భయపడకూడదు. ఇవన్నీ సహజమైన passing clouds. ఇట్టి కదిలిపోయే మేఘములకు మనం ఎందుకు కదలాలి? కదలని, చలించని, భ్రమించని నిత్యమైన సత్యమైన హృదయాన్ని ఆధారం తీసుకోవాలి. ఈ మూడింటి ఏకత్వాన్ని ప్రతి మానవుడు గుర్తించాలి. అనగా head, heart, hands ఈ 3H లనే మనం ఆధారంగా తీసుకోవాలి. హృదయంలో భగవంతుని ప్రతిష్ఠించుకో. Head లోపల నీవు చింతించు. Hands తో work చేయి. అదియే దీని అర్థము. Head, heart, hands ఈ మూడింటిని పవిత్రమైన కార్యములలో ప్రవేశపెట్టు. ఏ దానిని దలంచినా దైవకార్యంగా తలంచుకో. ఏ పని నీవు చేతులతో చేసినా దైవకార్యముగా విశ్వసించు. ఇదియే సరియైన అంతరార్థము. కానీ ఈ అర్థమును గుర్తించుకోలేక హస్తములను వ్యర్థము చేస్తున్నారు. తలను చాలా దుర్వినియోగపరుస్తున్నారు. హృదయాన్ని మాలిన్య పరుస్తున్నారు. కాదుకాదు. హృదయము భగవంతుని యొక్క స్థానము. ఆ భగవంతుని స్వస్వరూపమైన ప్రతిబింబమే మన హృదయం. Reflection, reaction, resound. ఇలాంటి భావనలతో జగత్తునకు సద్వినియోగపరచే సందేశాన్ని అందించాలి. ఏదో కొంచెం నారాయణసేవ చేయటం, బట్టలు అందించటం, సేవలు చేయటం, ఇవికూడా అవసరమే. కానీ ఇవి మాత్రమే ప్రధానం కాదు. యివన్నీ తాత్కాలికమైన కర్మలు. అవికూడను చేయవలసిందే. కానీ వాటితోబాటు శాశ్వతము, సత్యమైన ప్రేమతత్త్వము అభివృద్ధిపరచాలి. తెల్లవారి లేచిన మొదలుకొని రాత్రి పరుండునంతవరకు మనం చేసే సర్వకర్మలు ప్రేమమయంగానే ఉండాలి. Start the day with love. Fill the day with love, spend the day with love, end the day with love. This is way to God. నీ హృదయమును మొట్టమొదట ప్రేమతో



sri sathyasaivachanamrutam

నింపు. ఈ ప్రేమచేతనే సర్వకర్మలు ఆచరించు. తెల్లవారి మొదలు రాత్రి వరకు ఈ సర్వకర్మలందు ప్రేమతత్త్వాన్ని నీవు అనుభవించు. ఇదియే నిజమైన సందేశము. ఇట్టి సందేశమునందించే మహనీయులు చాలా అరుదుగా ఉంటున్నారు లోకములో. కానీ మెసెంజర్సు అని పేరు పెట్టుకున్నంత మాత్రమున చాలదు. భగవంతుని మెసేజ్‌ని ప్రపంచమునకు చాటాలి. ఎవ్వరైనా సరే వినినా వినకపోయినా నీ మెసేజ్‌ని నీవు చాటుతూ పోవాలి. అదృష్టం పండినవాడు వినగలడు. దురదృష్టం నిండినవాడు వదలగలడు. కనుక నీవు, అతను వింటున్నాడా లేదా అనే విచారణ చేయనక్కరలేదు. నీ పని నీవు చేయి. Do your duty. ఇది నా కర్తవ్యమని నీవు భావించాలి. కానీ అనేకమంది భక్తులమని అనుకుంటున్నారు. భక్తి అంటే ఏమిటి? కేవలం పూజించటము, భజనలు చేయటం, సేవలు చేయటం, మాత్రము చేత భక్తి కాదు. ఇవన్నీ అంగములు మాత్రమే. భక్తి కాదు. నిజమైన భక్తి భగవంతుని యొక్క సందేశమును ఏమాత్రము ఉల్లంఘించకుండా ఆచరించాలి. ఎట్టి పరిస్థితియందైనా ఉల్లంఘించకూడదు. ఇదియే సత్యతత్త్వము. సత్యహరిశ్చంద్రుడు ఏ పరిస్థితియందైనా ఏమాత్రము కృంగక, జంకక సత్యమును అనుసరిస్తూ పోయాడు. తన జీవితమంతా ఈ సత్యమార్గమునందే ప్రవేశపెట్టాడు. కానీ కలియుగ ప్రభావము చేత అనేకమంది అనేక సుఖములందు భగవంతుని విశ్వసిస్తుంటారు, పూజిస్తుంటారు. కానీ కష్టములు, నష్టములు, దుఃఖములు సంభవించెనా, దానివల్ల మనస్సు మార్చుకుంటారు. మీ కందరికి తెలుసు బైబిలు లోపల. జీసస్‌ను శిలువ వేయటాన్ని నిర్ణయించారు. ఆ సమయంలో జీసస్‌కు అత్యంత సన్నిహిత శిష్యులను ప్రశ్నించారు. ఎవరు జీసస్ సన్నిహితులని. ఎంత దగ్గరగా ఉన్నవాడు Peter! ఎంత దగ్గరగా ఉన్నవాడు మాథ్యు! ఎంత దగ్గరగా ఉన్నవాడు పౌల్! వీరెవరు ఆ సమయంలో మేము అతని followers కాము అన్నారు. చూశారా! వీరా దైవము యొక్క followers! ఏమైనా సరే మేము కూడా సిద్ధమే అని ఉండాలి. కానీ ఈవిధమైన త్యాగ భావమునకు మానవులు సిద్ధముగా లేరు. ఈ త్యాగము మానవుని ప్రధానమైన గుణము. ఎట్టి పరిస్థితియందైనా భగవంతుని ఆజ్ఞను మీరిపోరాదు. అదియే నిజమైన దీక్ష. ఆ దీక్షయందే త్యాగము ఆవిర్భవిస్తుంది. త్యాగము నందే అమృతత్వం ప్రాప్తిస్తుంది. నీవు చేసే

sri sathyasai vahini amrutam

చిల్లర కర్మలవల్ల కాదు. న కర్మణా, న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః. దేనికైనా సరే, శరీరాన్నైనా సరియే త్యాగము చేసి సర్వులకు దైవసందేశాన్ని అందించేదాంట్లో సిద్ధముగా ఉండాలి. ధనము పోతే సంపాయించవచ్చును. ఆరోగ్యముపోతే పోషించుకోవచ్చును. కానీ గుణములు పోతే సాధించలేము. ఈనాటి మానవుడు గుణములు ఏమాత్రం లెక్కచేయకుండా ధనము కోసం, సుఖం కోసం ప్రాకులాడుతున్నాడు. ఏమిటి ఈ ధనము? నిజమైన ధనము దైవసంపత్తియే. దైవప్రేమయే మానవుని నిజమైన ధనము. అట్టి నిజమైన ధనము కోల్పోయి అనిత్యము అశాశ్వతమైన ధనం కోసం ప్రాకులాడుతున్నారు. నిజముగా దృఢసంకల్పుడవై సత్యంకోసం పాటుపడు. నీకు ఎట్టి కష్టములు రావు. ఈనాడు అట్టిదానికి ఎవరూ ఏమాత్రం సిద్ధంగా లేరు. ఇంక, భగవంతుడు ఏరీతిగా రక్షించగలడు? భగవంతుడు ఏరీతిగా అనుగ్రహించగలడు! భగవంతుడు ఏరీతిగా నిన్ను కాపాడగలడు? ఎప్పటికీ కాపాడడు. ఇది అసాధ్యము. కనుక భగవంతుని అనుగ్రహం పొందాలంటే త్యాగమునకు సర్వవిధముల సిద్ధంగా ఉండాలి. సుఖానికి అంటే సిద్ధము. దుఃఖానికి అంటే దూరము. తినటానికి అంటే సిద్ధం. పని చేయటానికి అంటే పరారు. ఇది కాదు నిజమైన భక్తి యొక్క ప్రపత్తులు. దివ్యమైన సందేశమును జగత్తునకంతా చాటుతూ పోవాలి. అన్నింటికంటే గొప్ప సందేశము ప్రేమతత్త్వమే. ఈ ప్రేమను అందరికీ అందిస్తూ పోవాలి. ప్రేమ కంటే మించిన సంపత్తు మరొకటి లేదు. ఈ ప్రేమయే దైవ స్వరూపము. ఇట్టి భగవత్స్వరూపమైన ప్రేమ తత్త్వమును మనం ఏ పరిస్థితియందైనా వదలుకోరాదు. ఒకానొక సమయంలో ఒక దేవదూత ఒక పుస్తకమును పట్టుకొని చదువుతూ ఉండినాది. దాన్ని చూచాడు John. అమ్మా! ఏమిటా పుస్తకము అన్నాడు. "తీసుకో" అని యిచ్చింది. తిని జీర్ణము చేసుకోమని చెప్పింది. 'ఏమిటి? పుస్తకాన్ని భుజించటమా? జీర్ణముగావించుకోటమా? ఏమి దీని అంతరార్థము అని యోచించాడు. అనగా ఆ పుస్తకములోనున్న విషయాన్ని క్రోడీకరించుకుని దాన్ని హృదయములో చేర్చుకొని ఆ హృదయమునుండి practical లోపల అనుభవములోనికి తెచ్చుకొని దాని జీర్ణముగావించుకోమంది. జీర్ణము గావించుకొనుట అంటే ఆచరణలో పెట్టటమే. రామాయణము నందు కూడా చెప్పాడు వాల్మీకి. రాముడు 64 విద్యలు నేర్చాడు.

sri sathyasai vahini

రావణుడు 64 విద్యలు నేర్చాడు. ఇరువురు సమానమైన విద్యలున్న వారే. కానీ రాముడు ఆచరణలో పెట్టాడు. రావణుడు ఆచరణలో పెట్టక దుర్వినియోగం చేసుకున్నాడు. కనుక రావణుని దుష్టుడు అని పిల్చాడు వాల్మీకి. అదేవిధముగా ఈనాడు అనేక రకములైన విద్యలు చదువుతున్నారు. అందుకే ఈ గ్రంథమును జీర్ణించుకోమంది దేవదూత. దీన్ని పూర్తి ఆచరణలో పెడతానని అంగీకరించాడు. అప్పటి నుండి ప్రతి చిన్న విషయము ఆచరణలో పెడుతూ వచ్చాడు. కొంతకాలమైన తరువాత ఆ John పూర్తి క్రీస్తురూపాన్ని పొందాడు. ముఖమంతా క్రీస్తు రూపం వచ్చేసింది. మాటలన్నీ క్రీస్తు పదములే వచ్చేశాయి. చేతలన్నీ క్రీస్తు చేతలే అయిపోయినాయి. అన్నింటి యందు ఆచరణరూపములో John, Christ యిద్దరు ఒకటే అయి పోయినారు. దీనినే వేదాంత మందు బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి – దేనిని నీవు స్మరిస్తావో ఆ రూపాన్ని నీవు పొందుతావు అన్నారు. ప్రహ్లాదుడున్నాడు. ప్రహ్లాదుడు చిన్న బాలుడు. చిన్న బాలుడైనా దైవాజ్ఞ ఏమాత్రం ఉల్లఘించకుండా కష్టములను కూడా లెక్కచేయకుండా అన్నీ నారాయణుడే నారాయణుడే అనుకుంటూ పోయాడు. ఆ విధంగా అర్పితము గావించిన ప్రహ్లాదునికి నారాయణుడే రక్షించుకుంటూ వచ్చాడు. కొండలమీద నుండి గెంటించాడు తండ్రి. నారాయణ నారాయణ అన్నాడు ప్రహ్లాదుడు. నారాయణుడే వచ్చి పట్టుకున్నాడు. సముద్రములో తోసినారు. అక్కడ కూడా నారాయణుడే అన్నాడు. ఆ అలలు కూడా నారాయణ స్వరూపము ధరించాయి. పాములచేత కరిపించారు. విషము కూడా అమృతంగా మారిపోయింది. సర్వకష్టములు నారాయణ చింతన చేత అంతా నారాయణ స్వరూపాన్నే పొందినాయి. సర్వదా సర్వకాలేషు సర్వత్రా హరిచింతనం. నిరంతరము దైవచింతన చేస్తుంటే దైవస్వరూపాన్ని పొందుతారు మీరు. అయ్యో మేము భరించుకోలేమే అని నిరాశకు గురి కాకూడదు. భరించలేని బాధలు భగవంతుడు అందించనే అందించడు. నీవు భరించగలిగినవే అందిస్తాడు గానీ భరించలేనివి అందించడు. నీవు అనుకోవచ్చు. నాకు భరించలేని కష్టాలు కలిగినాయని. ఎప్పటినుండి ఈ కష్టాలు కలిగినాయని ప్రశ్నించినప్పుడు మూడు సంవత్సరముల నుండి అన్నారనుకోండి. ఈ మూడు సంవత్సరముల నుండి నీవు భరించగలగటం వల్లనే కదా మూడు సంవత్సరములు గడుపగలిగినావు. నీకు భరించగల్గినవే యిస్తున్నాడు గానీ

sri sathyasai vacanamrutam

భరించలేనివి యివ్వటం లేదు. కనుక భగవంతుడు test ఒక taste గా భావించుకుంటాడు. ఆవిధమైన tests కు మీరు ఏమాత్రం వెరవకూడదు. దైవచింతనలో ప్రాణమునైననూ అర్పితము గావించాలి. ఆ విధముగా ఉండినప్పుడే దైవము అన్ని విధములా ప్రాకులాడి మిమ్ము రక్షిస్తూ వస్తాడు. మొట్టమొదట Paul జీసస్ కు గొప్ప విరోధి. ఒకనాడు ఈ పాల్ స్వప్నములో జీసస్ పోయి నవ్వుతూ నిల్చాడు. పాల్ నీవు నిమిరి పాల్! నేను నీకు ఏమి కష్టము పెట్టాను, ఏమి నీకు ద్రోహం చేశాను. ఏమి నీకు అపకారం చేశాను. నన్ను దూషిస్తున్నావు. నీవు పడేబాధలు, నీవు పడే కష్టములు, నీవు పడే దుఃఖములు నేను యిచ్చినవి కాదు. నీ కర్మ ఫలితములే ఆవిధంగా నీకందిస్తున్నాయి. నీవు చేసిన action, reaction గా అనుభవిస్తున్నావు. అంతేగానీ నేను అందించినవి కాదు అని చక్కగా అతని ఆశీర్వదించేటప్పటికి అతని మనస్సు మారిపోయింది. తదుపరియే జీసస్‌కు దాసుడైపోయి Saint Paul అయి ఒక గ్రంథాన్ని వ్రాసాడు. ఈ విధంగా దుష్టులను సవరించి వారిని సక్రమమైన మార్గములో నిలుపుతూ వచ్చాడు. ఎన్ని విధములైన బాధలు పెట్టినా దేహమునకే బాధలు గానీ తనకే మాత్రము కాదు. ఇలాంటి ఆదర్శములు తీసుకొని మనం జీసస్‌ను ఆరాధన చేయాలిగానీ ఆదర్శములు లేకుండా ఆరాధన చేస్తే నిరుపయోగంగా ఉంటుంది. జీసస్ చెప్పినవి మూడే మూడు మార్గములు. I am the messanger of God నేను భగవత్ సందేశాన్ని జగత్తుకు చాటాలి. మానవుని హృదయము నందు సందేశము నందించాలి. దీనిలో నేను భగవంతుని మెసెంజరు. తదుపరి son of God. నేను కుమారుడను. నాతండ్రి భగవంతుడు. భగవంతుని ప్రోపర్టీ ఏమిటి? సత్యము, ప్రేమ, సహనము, శాంతి ఇవన్నీ తాను అనుభవించాలి. శాంతి కోసం పాటు పడాలి. ప్రేమ కోసం పాటుపడాలి. ధర్మం కోసం పాటుపడాలి. వీటిని ఆచరించి, అనుభవించి అందించాలి. అప్పుడే నీవు son of God అనటానికి సార్థకమవుతుంది. అన్నింటి యందు తాను ఏకత్వము పొందిన తరువాత I and my father are one అన్నాడు. అట్టి సమయంలో జీసస్‌కు బాధలు లేవు, కష్టములు లేవు, దుఃఖము లేదు. నిరంతరము ఆనందంగా జీవిస్తూ వచ్చాడు. అన్నింటికి సిద్ధమైపోయాడు. అందుకోసమే ఆ శిలువపై కొట్టినా నవ్వుతూ నిల్చున్నాడు. ఏమిటి, ఈ బాధలన్నీ దేహానికే కానీ నాకు కాదు.

srisathyasaivachanamrutam

**దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు....**

దేహము కాదు నేను, దేహిని. దేహాన్ని కాపాడే వాడను. దేహము నాయొక్క కవచము అని ఈవిధంగా తాను ఉద్ధారము చేసుకుంటూ పోయాడు. కనుక ప్రతి మానవుని భగవంతుని మెసెంజరుగా విశ్వసించాలి. మెసెంజరు స్వామి యొక్క ఆదేశాలను స్వామి సందేశమును జగత్తుకు చాటుతూ పోవాలి. ఒకరు యిష్టపడినా, యిష్టపడక పోయినా, కొంత మంది యస్ అన్నను, మరికొంత మంది నో అన్నను నీవు స్వామి మాత్రమే నాకు కావాలి అనే దీక్షతో గట్టిగా ఉండాలి. కొంతకాలానికి no yes లు నీ నోటికే గానీ, సాయికి సర్వము yes yes. అని తెలుసుకోగలుగుతావు. దైవత్వములో ఎట్టి దోషములు ఉండవు. ఎట్టి మాటలైనా, ఎట్టి పనులైనా, ఎట్టి కార్యములైనా అన్నీ సక్రమమైనవిగానే ఉంటాయి. నీ యొక్క భావాలకు, నీ ఊహలకు అది నీకు reflection గా వస్తుంటాయి. ఇవి సైకలాజికల్‌గా వచ్చేవే గానీ సాక్షాత్ స్వరూపకంగా వచ్చినవి కాదు. ఇవన్నీ దైవము ఇచ్చాడని నీవు భావిస్తూంటావు. దైవము ఎప్పుడూ మంచినే ఇస్తాడు గానీ చెడును యివ్వడు. చెడు నీ యొక్క reflection, reaction, resound. కనుక ఎప్పుడు reality యిచ్చేవాడు భగవంతుడు. అట్టి సత్యాన్ని నీవు చక్కగా అనుభవిస్తూ రావాలి.

మేథ్యూ టాక్స్ అధికారిగా ఉండేవాడు. బేస్తవారిని కలుస్తూ ఉండేవాడు. మీకు ఎట్లా జీసస్ పైన నమ్మకము వచ్చింది? అని సందేహాలతో అడిగేవాడు ప్రారంభంలో. యిలాంటి doubting thomas లు కలియుగములో మరింత ఎక్కువైనారు. నిరంతరము సందేహాలు, సందేహాలే. ఇలాంటివారితో చేరకూడదు. ఎందుకంటే వారి సంగముతో చేరినప్పుడు నీవు కూడా ఆ doubting thomasగా తయారౌతావు. నీవు బొగ్గుగా ఉన్నావు. దైవము అగ్నిగా ఉన్నాడు. ఆ అగ్నితో బొగ్గు చేర్చు. బొగ్గు అగ్ని అవుతుంది గానీ అగ్ని బొగ్గు కాదు. కనుక దైవముతో చేరు. నీవు కూడా దైవము అవుతావు. కానీ బొగ్గును బొగ్గుతో చేరుస్తున్నారు ఇప్పుడు. బొగ్గును ముట్టినా చేతికి గలీజు అవుతుంది. ఎంత నీటితో కడిగినా నీరు కూడా చెడిపోతాయి. కనుక దీన్ని పరిశుద్ధము చేయటానికి నీరు చేత కాదు. దైవాన్ని నమ్మినప్పుడే పరిశుద్ధమవుతుంది. పరిశుద్ధము కావాలనుకున్నప్పుడు పరిపూర్ణముగా విశ్వసించాలి. ఆ

srisathyasaivacharamrutam

నమ్మకమే సంపూర్ణమైన దివ్యత్వాన్ని పోషిస్తుంది.

ప్రేమస్వరూపులారా! అందరు భగవంతుని యొక్క మెసెంజర్సే. అందరూ ప్రేమస్వరూపులే. ప్రేమ లేని మానవుడు లోకములో లేడు. కానీ ఈ ప్రేమను దుర్వినియోగపరచుకుంటున్నారు. నీ కుమారులు, బిడ్డలు, భర్తలతో కాలాన్ని గడుపుతున్నావు. వీరినంతా చూచుకో. Do your duty sincerely. అంతేగానీ వారే ప్రధానమని అనుకోకూడదు. ప్రధానం ఒక్కడే అతనే దైవం. One is hero. World is zero. 1 అనే హీరోనే భగవంతుడు. 1 ప్రక్కన జీరో పెట్టు. 10 అయింది. Moon is zero. 100 అయింది. Sun is zero. 1000 అయిపోయింది. ఎప్పుడు విలువ వచ్చింది. ప్రక్కనున్న భగవంతుడనే హీరో వలన. హీరోపక్కన ఉండటం వలన జీరోస్‌కి అంత విలువ వచ్చింది. ఈ హీరోని తీసివేయి, అంతా జీరోనే. Hero becomes zero if he forgets God. దైవాన్ని మరచినప్పుడు సంపదలుండినప్పటికి అన్నీ జీరోయే. ఇవన్నీ దృశ్యకల్పిత జగత్తులోని దృశ్యములే. ఇవన్నీ అనుభవించటానికి సాధ్యము కానివి. దైవమనే హీరోని నిరంతరము విశ్వసించు. ఎట్టి సందేహములకు అవకాశం ఇవ్వవద్దు. నిస్సందేహంగా భగవంతుని విశ్వసించు. సర్వము నీకు అనుకూలమై పోతుంది. సర్వబాధలు పరిహారమవుతాయి. సర్వసంపదలు నీకు చేకూరతాయి. ఈ సత్యాన్ని తాను అనుభవించి లోకానికి అందించినటువంటి వాడు జీసస్.

ఈనాడు X-mas holiday అన్నారు. ఈ క్రిస్మస్ ఎక్కడనుండి వచ్చింది? రోమను పదము. నిజంగా చూస్తే December డిశంబర్‌లో కాదు క్రిస్మస్ . ఇది కేవలం చల్లదనముగా ఉంటుందని, ఎక్కడా బయటకు పోకుండా ఇంటిలోనే ఉంటారని, అనేక రకములైన కర్మలాచరించుకోవచ్చునని ఈ డిసెంబరును క్రిస్మస్ గా తీసుకున్నారు గానీ నిజంగా క్రీస్తు పుట్టినది మార్చ్. అలాంటి పవిత్రమైన క్రీస్తు చరిత్రపై అనేకమంది పుస్తకాలు రాస్తూ , మార్పు చేస్తూ వచ్చారు. జర్మనీలో లూయిస్ పుస్తకం వ్రాసాడు. అంతా విరుద్ధంగా వ్రాస్తూ వచ్చాడు. "ముండే ముండే మతిర్భిన్న:" అన్నట్లు తలలు వేరైనపుడు తలంపులు కూడా వేరువేరుగా వస్తుంటాయి. ఎవరికి తోచినట్టుగా వారు వ్రాస్తూ పోయారు. అసలు జీసస్ పుట్ట లేదని కొన్ని గ్రంథాలు వ్రాస్తూ వచ్చాయి. శిలువ చేసినది జీసస్ brother ని



srisathyasai vahini amrutam

కానీ జీసస్‌ను కాదన్నారు మరొకరు. ఆ brother నుశిలువ చేసినప్పుడు జీసస్ జపాన్‌లో ఉన్నాడని రాసినాడు ఇంకొకడు. ఇవన్నీ ఊహాగానములే. జీసస్ ఒక్కడే నిజమైన సత్యము.

ఒకానొక సమయంలో జీసస్ చిన్న బిడ్డగా ఉండినప్పుడు, తల్లితండ్రి ఇరువురు జరూసలెంలోని ఉత్సవానికి వెళ్లారు. అప్పుడు ప్రజలంతా గుంపులు చేరిపోయారు. ఆ గుంపుల లోపల ఈ చిన్న బిడ్డ తప్పిపోయాడు. ఎక్కడకు పోయాడు. ఎక్కడకు పోయాడని అనివైపులా వెతికింది తల్లి, పాపం. భరించుకోలేని బాధను అనుభవించింది. ఒకవైపున తల్లి, మరొకవైపున తండ్రి తిరిగి శోధించారు. కానీ ఎక్కడా కనిపించలేదు. ఏమి చేసేది? విసుగుపుట్టి చివరకు మందిరములో ప్రవేశించింది. ఆ మందిరములో ప్రీస్టు ఒక గ్రంథాన్ని బోధిస్తున్నాడు. ఆ ప్రీస్టుకు ఎదురుగా కూర్చొని ఏకాగ్రతగా వింటున్నాడు. తల్లి చూచింది. అయ్యో! ఆ రాజులెవరో చెప్పినట్టుగా భగవంతుని ఎడల ప్రేమ గలిగిన బిడ్డ అన్నారు, నిజమనుకుంది. అప్పుడు ఎత్తుకొని చాలా ఏడ్చింది మేరీ. అప్పుడా అబ్బాయి చెప్పాడు. 'అమ్మా! నేను ఎక్కడున్నానో అక్కడ వెతక్కుండా ఎక్కడనో వెతికితే నేను చిక్కుతానా? నేను భగవంతుని సన్నిధిలో ఉన్నాను. ఈ సన్నిధిని నేను పెన్నిధిగా భావించుకున్నాను. ఇక్కడ వెతక్కుండా ఎక్కడెక్కడో వెతికావు కాబట్టి నేను కనిపించలేదు అన్నాడు జీసస్. అదియే పెద్ద మెసేజ్. భగవంతుడు ఎక్కడున్నాడో అక్కడ వెతక్కుండా ఎక్కడెక్కడో వెతుకుతే ఎట్లా చిక్కుతాడు. ఎక్కడ చూచినా ఉన్నాడు భగవంతుడు. అయితే ప్రేమ స్వరూపుని తోడున్నాడు. ఆ ప్రేమ దగ్గర పోయి నీవు వెతుకు. ప్రేమతో వెతుకు. With God, to God. For God, From God. ఈవిధంగా తీసుకుంటే అంతా God అయిపోతుంది. ఆ భావముతో నీవు భగవంతుని వెతకాలి. నీవు వెతుకుతున్నావు. దేనికోసం వెతుకుతున్నావు? To God భగవంతుని కోసం వెతుకుతున్నాను. నీవు ఎక్కడ నుండి వచ్చావు from God. నీవు ఎక్కడున్నావు with God. ఈవిధంగా నీవు answers తీసుకుంటే ఎంత ఆనందపడతావు. మనం ఆ భావాన్ని ధృఢం చేసుకోవాలి. భగవంతుడు నాలోనే ఉన్నాడు. నావెంటనే ఉన్నాడు. జంటనే ఉన్నాడు. నా కంటనే ఉన్నాడు. ఎక్కడ చూచినా ఉన్నాడు. ఇలాంటి భగవంతుని వెతికేది ఎక్కడ? దీన్ని కూడా త్యాగరాజు చెప్పాడు. నేను ఎందు వెదకుదురా? రామ నేనెందు వెతకెదరో ఎక్కడ నేను వెతకేది? నీవు లేక నేను భరించలేను. నేను

జీవించలేను. నిన్ను ఎక్కడ వెతకాలి? అనుకుంటూ వెదుతూ వెదుతూ ఎక్కడా గతి లేదు. గంగలో పడిపోటానికి పోతున్నాడు. ఆ గంగలో లోతుగానున్న చోట పడటానికిపోతే అక్కడ కాలికి ఏదో తగిలింది. ఏమిటని తీశాడు. తీస్తే రామ విగ్రహమే. చూశారా! ఎక్కడ వెతికేదని రామచింతన చేసుకుంటూ పోతే తన కాలికే చిక్కాడు. అప్పుడు రాముని తీసుకున్నాడు. ఎంత గొప్పవాడవు రామా, నా వెంటనే ఇంటనే జంటనే ఉంటున్నావు. నేను ఆ సత్యాన్ని గుర్తించుకొనలేక అజ్ఞానములో ప్రవేశిస్తున్నాను.

రారా మా ఇంటి దాక. రఘువీర సుకుమార నే మొక్కెద. రారా! ఓ భగవంతుడా! నీవు ఇక్కడ చిక్కావు. రా. నా ఇంటికి రా. ఇంత ఏకత్వంగా భావించుకొని, దివ్యత్వమునకు సమీప సంబంధముగా విశ్వసించుకొని ప్రేమ తత్వాన్ని అనుభవిస్తూ వచ్చిన ఆ పరమభక్తునికే ఈ తత్వము తెలుస్తుంది. కానీ పరమభక్తులు కాని వారికి ఏమాత్రము తెలియదు. మలేరియా జ్వరము వచ్చిన వానికి చక్కెర తీసుకుని నాలుకపై వేసుకుంటే చేదుగా ఉంటుంది. చక్కర చేదుగా ఉందని అనుకుంటాడు గానీ తన నాలుకలో విషము లేదా. ఈ విషమును నాలుకపై ఉందిగానీ చక్కెరలో లేదు. నీలోనున్న poison దూరము చేసుకో. చక్కర తీపిగానే ఉంటుంది. భగవంతుడు మనయందే ఉన్నాడు. నాయందే ఉన్నాడు. In you, with you, around you, behind you. ఈవిధంగా నీవు అనుకుంటూ పోతే తప్పక నీవే భగవంతుడై పోతావు. దేవుడు వేరు, నేను వేరు అనుకోవద్దు. అనేకమందికి నేను చెప్పాను. స్వామీ, thanks అన్నారు. చీరలు యిచ్చినప్పుడు మన మెసెంజర్సులోనే కొంతమంది థ్యాంక్స్ స్వామీ, అన్నారు. నేను చెప్పాను. I am not third person. Third person కి thanks చెబుతారు నీ తల్లి నీకింత అన్నం పెడుతుంది. అమ్మా, నీకు thanks అని ఎవరైనా చెబుతారా? ఎవరో బయట యింటికి పోయినప్పుడు అన్నం పెడితే thanks అని చెబుతారు. I am not outsider. కనుక thanks అని ఎవరూ చెప్పకండి. Right కు fight చేయండి. అట్లు నా స్వామి, నా స్వామి అని స్వంతముగా భావించుకో. అప్పుడే నీకు సర్వవిధములైన హక్కులు చేకూరుతాయి. కానీ అట్టి హక్కులకు మీరు పోరాడక, మీ భ్రాంతులచేత, మీ సంకల్పాలచేత, మీ దుర్బుద్ధులచేత, మీ దురాలోచనలచేత, మీ దుర్భావములచేత చింతిస్తున్నారు. ఏది నేను కోరినా నా కోసం

srisathyasaivahini.org / srisathyasaivacharamrutam

కాదు. ఏది చెప్పినా నా కోసం కాదు. ఏది నేను చేసినా నా కోసం కాదు. నాకేదీ అక్కరలేదు. కానీ నాకు ఒక్కటి మాత్రం కావాలి. ప్రేమ మాత్రం నాకు కావాలి. ప్రేమ నీ ప్రాపరిటీ కాదు. That is also my property. ఎవరి యందైనా ప్రేమ ఉన్నదంటే అది భగవంతునియొక్క gift.. నీవు సంపాయించు కున్నది కాదు. కాబట్టి ఈ gift ను నీవు lift చేయి. అప్పుడు నీకు సరిపోయింది వస్తుంది. నీకు gift చేసిన దానినా తిరిగి భగవంతునికే gift చేయి. అదియే నీ ప్రధానమైన సేవ. దీనినే చెప్పారు.

**ఏ హృదయంబునొసగితివో ఈశ నాకు**<br>
**మడిగిదానినే యర్పింతు మహితమూర్తి**<br>
**పరగ వేరేమిదెత్తు నీ అర్చనమునకును**<br>
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు**

నీవు ఇచ్చినదే నీకు ఇస్తున్నాను. నాది కాదు. ఇది నీవు ఇచ్చిందే. ఆ భావముతో ఎవరి హృదయము కరుగుతుందో వాడే నిజమైన భక్తుడు. ఆ భావము ఎవరి హృదయముతో ఆవిర్భవిస్తుందో అతడే నిజమైన త్యాగి. కనుక అట్టి భావాలు మీ హృదయములో ఆవిర్భవించాలి. అది అనుకోకుండా నా భక్తి అని నీ భక్తిని మాత్రమే వర్ణించుకుంటుంటే అహంకారముగా రూపొందుతుంది. అహంకారము నకు అవకాశము ఇవ్వకూడదు. రామదాసు కూడా చెప్పాడు. చాలా కష్టాలు కలిగినాయి. త్యాగరాజుకు వచ్చాయి కష్టాలు. పరమభక్తులకు పరమ కష్టాలు వెంటాడుతూ వస్తాయి. ఎందుకోసం ఈ కష్టాలొస్తాయి. నీ హృదయాన్ని భద్రపరచేకోసమనే. నీ హృదయాన్ని పరిశుద్ధము చేసేకోసమనే. నీ కష్టాలు దూరం గావించే నిమిత్తమే. ఒక పాత్ర మనం తోమాలంటే చాలా కష్టపడాలి కదా! అదేరీతిగా నీ హృదయమనే పాత్రలో ఎంతో మాలిన్యం చేరుకుంది. దానిని పరిశుద్ధము చేసే నిమిత్తమై కష్టాలు వస్తుంటాయి. ఈ రామదాసు, తుకారాం, త్యాగరాజు కూడా కష్టపడ్డారు.

కారాగారములో బాధ అనుభవిస్తున్న రామదాసుకు రామునిపైన కోపం వచ్చింది. దైవంపైన కూడా కోపం వచ్చింది. ఏమి నీవు నిజంగా శక్తివంతుడా? నిజంగా శక్తి ఉంటే నా కష్టమును ఎందుకు పరిహారము చేయకూడదు. నీకు శక్తి లేదు. నాకు భక్తి ఉంది. తనను

srisathyasaivcharamrutam

తాను వర్ణించుకొని అహంకారం పెరిగిపోయింది. నాకు భక్తి ఉన్నది గానీ నీకు శక్తి లేదన్నాడు. కొంతసేపు మరి ధ్యానంలో కూర్చున్నాడు. ఛీ! నేను ఎంత దురదృష్టవంతుడను. నేను ఎంత దుర్మార్గుడను, నాలో భక్తి ఉన్నదని నాకు తెలుసునా? నీలో శక్తిలేదని నాకు తెలుసునా? చాలా పొరపాటు. స్వామీ క్షమించమని చెప్పాడు. రామా! నీశక్తిని గుర్తించటం ఎవరి తరము.

**కపివారధిదాటునా! కలికి రోట గట్టునా!**
**లక్ష్మణుండు కొలచునా? లక్ష్మీదేవి వలచునా?**
**సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచి చూచి మ్రొక్కునా**
**అబ్బ రామశక్తి ఎంతో గొప్పరా!**

నీ శక్తి చాలా గొప్పది స్వామి! నేను అల్పుడనైపోయి నీ శక్తిని అల్పంగా భావించాను. నన్ను క్షమించు అన్నాడు. ఎప్పుడు భగవంతునికి అర్పితమై పోయాడో తక్షణమే ఇద్దరు వచ్చారు. స్విచ్ వేసినప్పుడు లైటు ఎట్లా వస్తుందో నీ హృదయము పవిత్రము గావించుకొని ఎప్పుడు భగవంతునికి అర్పితము గావించుకుంటావో అప్పుడు తక్షణమే వస్తాడు భగవంతుడు. క్షణము కూడా ఆలస్యము చేయడు. ఒక సెకండు కూడా ఆలస్యం చేయడు. వచ్చారు యిద్దరు. మూటలు మోసుకుని వచ్చారు. తానీషా దగ్గరకి పోయారు. అయ్యా నీ డబ్బు నీకు యిచ్చేస్తున్నాము అన్నారు. ఎవరు పంపించారు?అని అడిగాడు తానీషా. రామదాసు పంపించాడు. రామదాసుకు ఇంత డబ్బు ఎక్కడనుండి వచ్చింది? మీవెవరు? అడిగాడు తానీషా.

వారిద్దరు జవాబు చెబుతున్నారు. రామలక్ష్మణులము మేము, రామదాసు పంపగ వచ్చినాము అన్నారు. చూశారా! రాముడు, లక్ష్మణుడు రామదాసు బంటులైపోయినారు. భక్తులకు సర్వెంట్లైపోతాడు భగవంతుడు. కానీ అలాంటి దివ్యత్వాన్ని గుర్తించుకోలేక పోతున్నారు భక్తులు. అదేవిధంగా భక్తులు ఆదర్శమునందిస్తూ వచ్చారు. అప్పుడప్పుడు అన్నీ అడ్డులు కలుగుతుంటాయి. అనేక విధములుగా వాదిస్తూ వస్తుంటారు. హింసిస్తూ వస్తుంటారు. పరిహసిస్తూ వస్తుంటారు. కానీ ఏమాత్రము నష్టము ఉండదు. ఎవరేమి

srisathyasaivachanamrutam

చేసినా వారికే దాని ఫలితము వస్తుంది. దైవత్వానికి ఏమాత్రం అంటదు. ఎప్పుడు పవిత్రంగానే ఉంటుంది. కనుక ఎవరు ఎన్ని అన్నప్పటికి మీరు శాంతము వహించండి. దేనికి కూడా మీరు వాదించుటకు ప్రయత్నించవద్దండి. ఈ argument అనేది మంచిది కాదు. వాదించుకోటం వలన యింకా వైరము పెరిగి పోతుంది కానీ శాంతము మనకు పెరగదు. కనుక ఎప్పుడు argument కి పూనుకోవద్దు. ఎవరైనా ఏమైనా అంటే ఫక్కున నవ్వండి. మీ smile వారికి తగిన punishment గా వస్తుంది. ఈ Paul చాలా దూషిస్తూంటేవాడు జీసస్‌ను. ఒక్కతూరి పౌల్ దగ్గరకుపోయి ఫక్కున నవ్వినాడు జీసస్. నవ్వులోని మాధుర్యమే పౌల్‌లోని విషాన్ని పూర్తి పరిహారం చేసింది. కనుక నీవు ఎప్పుడు నవ్వుముఖంతో ఉండాలి. ఎప్పుడు castrol oil face పెట్టకూడదు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని దుఃఖాలు వచ్చినా దాన్ని భరించుకోవాలి. నవ్వు ముఖంతో ఉంటుండు. Happiness is union with God. భగవంతుని దగ్గర ఈ ఆనందము పొందాలి.

ప్రేమస్వరూపులారా! ప్రతి సంవత్సరం క్రీస్తు పండుగ చేసుకుంటున్నారు. మీరు ఎన్ని దేశాలనుండో వచ్చారు. నిజమైన క్రీస్తు పండుగ, క్రిస్‌మస్ ఒక్క ప్రశాంతి నిలయంలో తప్ప మరెక్కడా జరగదు. ఎందుకంటే క్రిస్‌మస్ కొంతమంది క్రిష్టియన్లు కలసి చేసుకుంటారు. మిగిలిన మతముల వారు ఏమాత్రం ప్రవేశించరు. హిందువులు ఏమైనా హిందూ పండుగ చేసుకుంటే హిందువులు మాత్రమే ప్రవేశిస్తారు గానీ యితరులు ప్రవేశించరు. కానీ యిక్కడ అట్లా కాదు. హిందువులు, క్రిష్టియన్సు, పార్సీలు అందరు చేరిపోతున్నారు. సర్వమత సమన్వయమైనది మన ప్రశాంతి నిలయము. యితరచోట్ల చక్కగా bottles త్రాగటము, మృగములను కొట్టి తినటము. కారులలో స్పీడుగా వెళ్ళిపోవటము. Accident లో ప్రాణాలు వదలటము. యిది అక్కడ క్రిష్టమస్ యొక్క వైభవము. కానీ ఇక్కడి X-mas అట్లాంటిది కాదు. తెల్లవారి 3 గం॥లకు ప్రారంభమైనది రాత్రి 12 గం॥ల వరకు దైవచింతన చేత నిండిపోతున్నది. అంతా Holy day, not holiday. చాలామంది X-mas holidays కి వచ్చినాము అంటారు. మీకు holiday కానీ మాకు holy day. ఇలాంటి holy days ఎక్కడా జరగవు. ఇలాంటి పవిత్రమైన దానిని మీరు అనుభవించినందుకు మీమీ స్థానములకు వెళ్ళినప్పుడు ఒక పవిత్రమైన భావాన్ని ఆచరణలో పెట్టాలి. ఎక్కడకి పోయినా

sri sathyasaivachanamrutam

I am the messenger of God అనే భావాన్ని నీవు ధృఢపరచుకో. Messenger of God కనుక భగవంతుని message చాటుకుంటూ పో. భగవంతుని సువాక్యములన్నీ అందరికీ పంచు. అదే నీ ప్రధానమైన కర్తవ్యము. దీనికంటె మించిన పని మరొకటి లేదు. దీనికంటె మించిన సేవ మరొకటి లేదు. శిలా హృదయుని కూడా నీవు అమృత హృదయంగా మార్చివేయి. వెన్న హృదయంగా నీవు మార్చాలి. అలాంటి హృదయముగా మీరు మార్చి, మీరు కూడా మారి, దైవచింతన చేత లోకకళ్యాణమునకు మీరు పాటు పడండి. ప్రపంచమే సుఖపడాలి, నాదేశము సుఖపడాలి, గ్రామము సుఖపడాలి అనే భావము పెట్టుకోకూడదు. ప్రపంచమే ఒక గృహము. కాబట్టి ఇండియా ఒక చిన్న రూమ్. అమెరికా ఒక చిన్న రూము. జపాను ఒక చిన్న రూము. ఇంగ్లాండు ఒక చిన్న రూము. యింటిలోపల అన్నీ రూములవంటివే ఈ దేశాలు. కాబట్టి యింటి క్షేమాన్ని కోరినప్పుడు జగత్తంతా క్షేమంగానే ఉంటుంది. దీనిని పురస్కరించుకొనే లోకస్సమస్తా సుఖినోభవంతు అన్నారు. ముఖ్యంగా మీరు చేయవలసిన సాధన ప్రేమతత్త్వమే. Love, love. నిన్న దినం పిల్లలు డ్రామా వేశారు. ఎంతచక్కగా చేశారు. ఆ love వలనే ఆ దుర్మార్గుని హృదయం మారిపోయింది. కనుక ప్రేమచేత ఎలాంటి కఠిన హృదయమునైనా మార్చగలం. అయితే కొన్ని హృదయాలు మరింత ఇనుప కడ్డీల వలె ఉంటాయి. కొంతకాలం టైము తీసుకుంటుంది. నీవు కొంచెం ఓపిక పట్టుకో. కొంతకాలానికి అవికూడా మారిపోతాయి. నీ హృదయం మాత్రం కఠిన హృదయంగా మార్చుకోకుండా ప్రేమ హృదయంగా పెంచుకోవాలి. స్వామి యొక్క తత్త్వము, నా యొక్క పవిత్రత, ఎవరు అనుభవించలేరు. తెలుసుకోలేరు. మొట్టమొదటి X-mas యిక్కడ జరిగినప్పుడు పాట పాడాను 20 సం॥ల క్రితం.

**Love is my Form, Truth is my breath**
**Bliss is my food**
**My life is my message expansion is my life**
**No season for love. No reason for love**
**No death, no birth.**

సాయిబాబా సమాచారం చెప్పాలనుకున్నప్పుడు ఈ పాటతో మీరు ముగించండి. అప్పుడు

srisathyasaivachanamrutam

వారు అర్థం చేసుకోగలరు. Love is his form. అందుకోసమే My life is my message. మీరందరు ప్రపంచమందరితో సోదరత్వాన్ని పెంచుకొని brother hood of man, father hood of God ఈ రెండింటిని మీరు ధృఢం చేసుకోండి.

**(తేదీ 25-12-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam